సాక్షి నిర్మల్

శనివారం । 22 । జూన్ । 2024



ఘనంగా వటసావిత్రి వ్రతం
జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా వటసావిత్రి వ్రతాన్ని మహిళలు ఘనంగా జరుపుకు న్నారు. కుటుంబం కోసం ఈ వ్రతం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. 9లో▸



జయశంకర్ సార్‌కు నివాళి..
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు నివాళులర్పించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6 /25.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సీనియర్ నాయకులు రావుల రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదె విలాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, బీజేవైఎం నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, సర్పంచ్ అంకం శ్రీనివాస్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్‌లో ఫైర్ విన్యాసాలు



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ షాపింగ్‌మాల్‌లో అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చూపించారు. ప్రజలు ప్రమాదాల బారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది అశోక్‌కుమార్, హుస్సేన్ షా, అజయ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల్లో అర్హులకు పదోన్నతి కల్పించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఇటీవలే నిర్వహించిన ఉపాధ్యాయ పదోన్నతులతో ఏర్పడిన ఖాళీ స్థానాల్లో అర్హులకు పదోన్నతి కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, అశోక్ డీఈవో రవీందర్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒక్కో ఉపాధ్యాయుడికి ఒకటి కంటే ఎక్కువ పోస్టుల్లో పదోన్నతి రావడంతో ఏదో ఒకస్థానంలో జాయిన్ కావడంతో మిగిలిన ఖాళీలు భర్తీ చేయాలన్నారు. లేకపోతే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు నిరాశే మిగులుతుందని తెలిపారు. నాట్ విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్‌లో వివరాలు పొందుపర్చాలని సూచించారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గోవర్ధన్, రాజగంగ తదితరులు ఉన్నారు.

గోదావరిలో తెప్ప పూజలు



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ పరిధిలోని బ్రహ్మేశ్వరాలయం గోదావరినదిలో శుక్రవారం తెప్ప పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి నదిలో స్నానాలను ఆచరించి తెప్ప పూజలను నిర్వహించారు. నదిలో తెప్పలను వదిలారు. అక్కడే అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఇకపై రోజూ ప్రజావాణి

నిర్మల్ చైన్‌గేట్: ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేలా ఇకపై ప్రతీరోజు ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణితోపాటు మిగతా పనిదినాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించడానికి కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ ఫిర్యాదుకు రశీదు పొందవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుల పురోగతికి సంబంధింత శాఖల వారీగా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులకు రుణవిముక్తి



బ్యాంకులో రైతులు (ఫైల్)

- రూ.2 లక్షల వరకు మాఫీకి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్ డేట్
- ఆగస్టు 15 వరకు మాఫీకి కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు

నిర్మల్: 'హమ్మయ్య.. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇప్పటికీ సర్కారు కరుణించింది. ఏడాదికేడాది పంట మీద అప్పు పెరుగుకుంటా పోయింది. లక్ష దాటి రెండు లక్షలకు చేరింది. పండించిన పంటలు పెట్టిన పెట్టుబడికే సరిపోతుండటంతో రుణం కట్టడం కష్టమైంది. ఇప్పుడు సర్కారు ఒకేసారి రూ.రెండులక్షల రుణం మాఫీ చేస్తామనడంతో పాణం సల్లవడ్డట్లయ్యింది...' అని జిల్లా రైతులు అంటున్నారు. రూ.2లక్షల వరకు రైతురుణాలను మాఫీకి రాష్ట్ర మంత్రివర్గ కేబినేట్ ఆమోదం తెలుపడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వాళ్లకే వర్తిస్తుంది..
ప్రస్తుత సీజన్ నేపథ్యంలో రైతు సంక్షేమ చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ చర్చించింది. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల్లో బాగా ప్రచారం చేసిన రైతు రుణమాఫీపై కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2023, డిసెంబర్ 9ని కటాఫ్ తేదీగా నిర్ణయించింది. ఆ తేదీ వరకు రూ.2 లక్షలలోపు తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తించనున్నట్లు పేర్కొంది. అది కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే ఆగస్టు 15 లోపు మాఫీ పూర్తిచేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీసుకున్న ఈ రుణాలను మాఫీ చేసేందుకు రూ.39 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోనూ దాదాపు లక్షకుపైగా రైతులు లబ్ధి పొందనున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు..
గత ప్రభుత్వం రూ.లక్షలోపు రైతు రుణమాఫీ చేసింది. కానీ విడతల వారీగా చేపట్టడంతో రుణమాఫీ ఎప్పుడవుతుందా.. అని రైతులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇందులోనూ కొందరికీ ఇంకా మాఫీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రుణమాఫీ కాకపోవడం, చెల్లించే పరిస్థితుల్లో లేకపోవడంతో ఇటీవల లక్ష్మణచాందకు చెందిన ఓరైతుకు బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. ఇక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనే రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు పలు పథకాలు ప్రకటించిన గత డిసెంబర్ 9నే రుణమాఫీ కూడా చేస్తుందని రైతాంగమంతా భావించింది. కానీ భారీ బడ్జెట్‌తో కూడుకుని ఉండటంతో కొత్త సర్కారు సమయం తీసుకుంది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోపు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. ఈ ప్రకారం ఇప్పుడు రాష్ట్ర కేబినేట్ దీనిపై నిర్ణయం తీసుకుంది.

ఏకకాలంలో మాఫీ..
జిల్లాలో దాదాపు 1.87 లక్షల మంది రైతులు ఉన్నారు. 4.40 లక్షల ఎకరాలు పంట భూమి ఉంది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీరైతు ఎంతో కొంత పంట రుణం తీసుకున్నారు. చాలామంది అసలు కట్టలేని పరిస్థితుల్లో ఏటా వడ్డీలు కట్టుకుంటూ రుణాన్ని రెన్యువల్ చేయించుకుంటున్నారు. అలా.. తీసుకున్న రుణానికి వడ్డీ కడుతున్నా.. ఏడాదికేడాది అసలు మాత్రం పెరుగుతూ పోతోంది. రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు చేరిన రైతులకు ఇప్పుడు సర్కారు తీపికబురు చెప్పింది. తాము ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేసేందుకు నిర్ణయించింది. అది కూడా.. ఏకకాలంలో ఈ మొత్తాన్ని మాఫీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పడంతో రైతాంగం హర్షం వ్యక్తంచేస్తోంది.

'భరోసా' కూడా ఇస్తే..
రూ.రెండులక్షల రుణమాఫీని చేపడుతున్నట్లే రైతు భరోసానూ అమలు చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు. గత యాసంగి పంటకు అంతకు ముందు ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం డబ్బులే అందించారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల కావస్తున్నా.. ఇప్పటి వరకు కాంగ్రెస్ పేర్కొన్న రైతుభరోసా పథకం అమలు చేయలేదు. ఈ పథకం ప్రకారం ఎకరాకు రూ.15వేలు ఇవ్వనున్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో ఈ మొత్తాన్ని కూడా ఇస్తే.. అటు రుణభారం తప్పడంతోపాటు పెట్టుబడికి కూడా ఇబ్బంది ఉండదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం రైతుభరోసాను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పక్కాగా సాగుచేసే రైతులకే ఈ పథకం అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది..



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు పంట భూమిపై రూ.2 లక్షల దాకా రుణం ఉంది. ఇప్పుడు ఈ రుణభారం తప్పితే.. ఇక ఇబ్బంది ఉండదు.
–గురాల లింగారెడ్డి, రైతు, మునిపెల్లి, మం.లక్ష్మణచాంద

భారం తప్పుతుంది..



నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. దీని మీద పంట అవసరాల కోసం గ్రామీణ బ్యాంకులో రూ.1.30 లక్షల వరకు రుణం తీసుకున్నా. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుండటంతో ఈ భారం తప్పనుంది. అలాగే పెట్టుబడి సాయం కూడా అందిస్తే బాగుంటుంది.
–అల్లకొండ సత్యనారాయణ, రైతు, భోసి, మం.తానూరు

ఇచ్చినమాటకు కట్టుబడి..



ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడం హర్షనీయం. రైతు సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వం కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలోనూ భారీసంఖ్యలో రైతులకు రుణమాఫీ ప్రయోజనం చేకూరుతుంది.
–కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

రైతు భరోసా ఎప్పుడిస్తరు..



రైతులకు ఇస్తామన్న రైతు భరోసాపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. రుణమాఫీని అర్హులైన రైతులందరికీ ఏకకాలంలో చేయాలి. రైతు భరోసా కూడా ఇవ్వాలి.
–ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీ నేత

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మహిళా సంక్షేమ అధికారి నాగమణి



నేర్చుకున్న అంశాల గురించి ఆరా తీస్తున్న నాగమణి

సారంగపూర్: ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నేర్చుకున్న అంశాలకు అనుగుణంగా కేంద్రాల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా మహిళా సంక్షేమ అధికారి నామగణి అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నిర్మల్ ప్రాజెక్టు పరిధిలోని పూర్వ ప్రాథమిక విద్యాబోధన శిక్షణను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు నేర్చుకున్న అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న పూర్వ ప్రాథమిక విద్యాబోధన అంశాలను పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ శిక్షణలో చెప్పే అంశాలు 3 నుంచి ఆరు ఏళ్లలోపు పిల్లల అవసరాలకు అనుగుణంగా రూపొందించారని తెలిపారు. శిక్షణలో భాగంగా మాస్టర్ ట్రినర్లు విజయగౌరి, మంగళ, జ్యోతి ఇప్పటి వరకు నేర్పించిన అంశాలను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రినర్లను అభినందించారు. కార్యక్రమంలో శిక్షణ నోడెల్ అధికారి నిరంజన్‌రెడ్డి, నిర్మల్ ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ రాము, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై విచారణ చేపట్టాలి

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీ జరిగిందని ఒకే పరీక్షా కేంద్రంలో 8 మందికి టాప్ ర్యాంకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. అనంతరం ఆర్డీవో రత్న కల్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, ఎర్రవోతు రాజేందర్, టీపీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్నూ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలు మూసివేయాలి



ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థను మూసివేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టై లు అధిక ధరలకు అమ్మడమే కాక విద్యా సంస్థను నడపడానికి అనుమతి పొందకుండానే పాఠశాల నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిరసనలో మాస్‌లైన్ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వి.మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దిగంబర్, న్యూడెమోక్రసి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్, రుద్ర ప్రతాప్ పాల్గొన్నారు.

బదిలీ కోరుకునే ఎస్జీటీలకు సూచనలు

నిర్మల్ రూరల్: ఎస్జీటీ బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు డీఈవో రవీందర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ఎస్జీటీ లేదా ఉత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు బదిలీల్లో భాగంగా స్పౌజ్ కేటగిరీ పాయింట్లు వాడుకుంటున్న సందర్భంలో వెబ్ ఆప్షన్స్ పెట్టుకునే తేదీ నాటికి, వారి స్పౌజ్ ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలకు దగ్గర పాఠశాల తర్వాత దూరం అనుసరించి, దగ్గర నుంచి దూరంగా ఇతర పాఠశాలలు (మండల యూనిట్ లేదు) ఆర్డర్‌లో ఆప్షన్ పెట్టుకోవాలని వివరించారు. అలా కాకుండా ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలకు దగ్గర పాఠశాలలను వదిలి, ప్రియార్టీలో దూరం పాఠశాలలు ఆప్షన్స్ ఎంచుకుంటే వారు సీసీఏ రూల్స్ ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. స్పౌజ్ /ప్రిఫరెన్షియల్ ఉపాధ్యాయులు 5/8 సంవత్సరాలు పూర్తి కాకుండా, మళ్లీ స్పౌజ్ పాయింట్స్ వాడుకుంటున్నట్లు విద్యాశాఖ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్పౌజ్ పాయింట్లను విత్ డ్రా చేసుకోవాలనుకుంటే శనివారం డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర నీటి పారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ గుమ్మడి అనిల్‌కుమార్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. ముధోల్ నియోజకవర్గంలోని కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ముంపు గ్రామమైన గుండెగాం నిర్వాసితులకు పరిహారం అందించడంతోపాటు, ముంపు సమస్యను పరిష్కరించాలని కోరారు. సిరాల ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు.

ఆరోగ్య'యోగ'ం ఆనందభాగ్యం

యోగాతో సహజ శక్తి..



యోగా డేలో పాల్గొని ఆసనాలు వేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: యోగా ప్రకృతి సిద్ధమైన శక్తిని అందిస్తుందని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్పీ యోగాసనాలు చేశారు. యోగా శిక్షకుడు హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ సిబ్బందితో ఆసనాలు వేయించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. యోగా, నడక దినచర్యలో భాగం కావాలని సూచించారు. పోలీసుల ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని తెలిపారు. – ఎస్పీ జానకి షర్మిల



ధ్యానం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ డిగ్రీ కళాశాలలో యోగా ఆసనాలు వేస్తున్న డీఈవో, అధికారులు

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం...
- జిల్లా వ్యాప్తంగా ఆసనాలు వేసిన ప్రముఖులు

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌చైన్‌గేట్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి శారీరకంగా మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో యోగాసనాలు, ధ్యానం వంటి పలు ప్రక్రియలను ఆచరిస్తూ సాధన చేస్తే మంచి ఉపశమనం కలుగుతుందని యోగా సాధకులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ప్రాముఖ్యతను తెలిపేలా జిల్లా వ్యాప్తంగా యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, యువత, విద్యార్థులు ఆసనాలు వేశారు. యోగాతో శారీరక, మానసిక రుగ్మతల నుంచి బయటపడొచ్చని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..
నిత్య జీవితంలో యోగా భాగమైతే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో ఆయుష్ శాఖ, వశిష్ఠ యోగా సంఘటన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని జిల్లా వాసులకు 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తన దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. 'తన కోసం, సమాజం కోసం యోగా' అనే నినాదంతో ముందుకెళ్లాలని తెలిపారు. అనంతరం యోగా దినోత్సవ కార్యక్రమ నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీడబ్ల్యూవో నాగమణి, డీఎంహెచ్‌వో ధనరాజ్, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జిల్లా బెటాలియన్ ఆధ్వర్యంలో...
నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ 32వ తెలంగాణ బెటాలియన్ ఆదిలాబాద్ జిల్లా అధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. నిర్మల్ సెక్టార్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రవి హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్బాకు చెందిన ఎన్‌సీసీ కాడేట్స్, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను వివరించారు. నిత్య జీవితంలో యోగా భాగం కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి జేభీమారావు, కస్బా పాఠశాలఎన్‌సీసీ అధికారి యాటకారి సాయన్న, రవి హైస్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, డాక్టర్ పీజీ.రెడ్డి, రవికుమార్, సమన్వయకర్త నాగేశ్వర్, నర్సయ్య, డాక్టర్ శంకర్, త్రిపాట్ వెంకట్ రెడ్డి, జగదీష్, షేక్ జాన్‌బాబు, అరుణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో..



కోర్టు ఆవరణలో యోగా సాధన చేస్తున్న జడ్జి దేవేంద్రబాబు, న్యాయవాదులు

భైంసాటౌన్: పట్టణంలో ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక నర్సింహ కళ్యాణ మండపంలో నర్సింహ యోగా గ్రూప్, పతంజలి యోగా పీఠం ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించగా, శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకులు ప్రాముఖ్యత వివరించారు. అనంతరం యోగాసనాలు వేశారు. కోర్టు ఆవరణలో జడ్జి డి.దేవేంద్రబాబు న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు. న్యాయవాదులు సి.శంకర్, ఏజీపీ సంతోష్ కులకర్ణి, మునీర్ అహ్మద్, కోర్టు సిబ్బంది అమర్నాథ్, వైద్యులు మహిపాల్, రామకష్ణ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..



యోగా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. జడ్జి కర్ణ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పనితోపాటు, ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షురాలు కవితా రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..
నిర్మల్‌ఖిల్లా/నిర్మల్ చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు మాట్లాడుతూ.. యోగా కేవలం శారీరక వ్యాయామం కాదు అంతర్గత శాంతి, సహనశీలతను దారిలోకి తీసుకోవడానికి ఒక మార్గమని అన్నారు. ఇందులో విభిన్న యోగసనాలు, ప్రాణాయామ విధులు, ధ్యాన అభ్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమం వాకర్స్ అండ్ లాఫర్స్ అసోసియేషన్ సభ్యులతోపాటు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.నాగేశ్వర్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ కాడెట్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడిని కాపాడిన ఎక్సైజ్ కానిస్టేబుల్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శుక్రవారం భైంసా పట్టణానికి చెందిన శ్రీరామ్‌కు ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయమై నోటిలో నుంచి నురగలు వచ్చాయి. గమనించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటేశ్ అతడికి ప్రథమ చికిత్స చేసి రక్షించాడు. దీంతో అతడిని పలువురు అభినందించారు.

ప్రమాదంలో మహిళ మృతి

నార్నూర్: మహాగావ్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి రోడ్డుపై పడిన సునీత (45) అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రహీంపాషా తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కొర్పోనా తాలూకా పరిధిలోని నందపాటర్‌కు చెందిన సునీత కుమారుడు రవితో బైక్‌పై శుక్రవారం మండల కేంద్రంలోని దర్గాకు వచ్చింది. మొక్కు చెల్లించి తిరిగి వెళ్తుండగా మహాగావ్ గ్రామ సమీపంలో రోడ్డుకు ఆవులు అడ్డం వచ్చాయి. దీంతో బైక్ అదుపుతప్పి సునీత రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. రవికి స్వల్ప గాయాలయ్యాయి. సునీత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

బాసర: బాసరలోని శ్రీజ్యోతిర్లింగ శివాలయంలో ఆలయ అర్చకుడు అంబికశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం 12 జ్యోతిర్లింగాలకు అభిషేకం, అర్చన, హోమం తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తానూర్ మండలానికి చెందిన మన్యంవార్ స్వప్న–కిషన్ దంపతుల తరఫున భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందజేశారు.

ముగ్గురు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఇందులో ఓ హెడ్ కానిస్టేబుల్‌పై భూ వివాదానికి సంబంధించి ఇదివరకే ఎఫ్ఐఆర్ నమోదైంది. మరో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. డాటా వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చింతల్‌బోరివాసిని మోసం చేసిన యూట్యూబర్

బోథ్: మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన వ్యక్తిని ఓ యూట్యూబర్ మోసం చేశాడు. వివరాలు.. చింతల్‌బోరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మహారాష్ట్రలోని నాగపూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. యూట్యూబ్‌లో ఓ యూట్యూబర్ ఆయనకు పరిచయమ్యాడు. తన వద్ద ఉన్న బైక్‌ను రూ.16,500 కే విక్రయిస్తానని నమ్మించాడు. రూ.7వేలు అడ్వాన్స్‌గా పంపించాలని కోరగా, చింతల్‌బోరి వాసి అతడు పంపిన క్యూఆర్ కోడ్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత మిగతా డబ్బులు పంపించాలని కోరగా మళ్లీ పంపించాడు. వాహనంపై పోలీస్ జరిమానాలు ఉన్నాయని మరో రూ.9999 పంపించాలని కోరగా, ఈ మొత్తాన్ని కూడా పంపించాడు. ఇలా దశలవారీగా మొత్తం రూ.51,273 యూట్యూబర్‌కు పంపించాడు. మళ్లీ జీఎస్టీ కట్టాలని అందుకోసం రూ.20 వేలు పంపాలని యూట్యూబర్ కోరగా చింతలబోరి వాసికి అనుమానం వచ్చింది. తాను మోసపోయాయని గ్రహించి శుక్రవారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185219]

■ PVT కంగకి కంప్యూటర్ ఆపరేటర్ & టెలి కాలింగ్ అమ్మాయిలు కావలెను. జీ॥ 6000/- + ఇన్సెంటివ్+కమీషన్,ఆఫీస్@ఆదిలాబాద్ Age: 20-30. ఫోన్ 9381932213 / 7075080883 [H-189670]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఆయువు తీస్తున్న క్షణికావేశం

మంచిర్యాలక్రైం: దేవుడు సృష్టించిన సమస్త ప్రాణకోటిలో తెలివైన ప్రాణి అంటే మానవుడే. అత్యంత పిరికి తనంతో ప్రతీ చిన్న విషయానికీ ఆత్మహత్య చేసుకునే ఏకైక ప్రాణి కూడా మనిషే. ఎంతటి గాయమైనా.. నెత్తురు కారుతున్నా.. చా వు వెనకాల తరుముతున్నా బతకాలనే ఆశతో తప్పించుకోగలను అనే నమ్మకంతో అడవిలోని చిన్నచిన్న జంతువులు సమస్యలతో పోరాటం చేస్తుంటే... మానవులు మాత్రం చిన్న చిన్న సమస్యలకే తమ ఆయువును వదులుకుంటున్నారు. సమస్యల సుడిగుండం నుంచి బయటపడలేననే అపనమ్మకం, బతుకు మీద భయంతో అవివేకంతో ఊపిరి వదులుతున్నారు. ఇలాంటివారు ఒక్క క్షణం ఆలోచించాలి. ఆత్మహత్య చేసుకోవడానికి ఎంత ధైర్యం చేస్తున్నారో.. బతకడానికి అందులో ఆవగింజంత ధైర్యం చేస్తే చాలు బతికిపోతారు. కారణాలేవైనా సరే సమస్యలపై సమరం చేయాలి. ప్రతీ ప్రాణికి కష్టాలుంటాయనే నిజాన్ని గ్రహించాలి. కష్టాల కడలిని దాటి ముందుకు వెళ్తేనే విజయం వరిస్తుందని గుర్తించాలి. జిల్లాలో 2023 నుంచి 2024 జూన్ వరకు 357 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో 33 శాతం వరకట్నం, 31శాతం భార్యాభర్తల మధ్య అనుమానం, 26శాతం వివాహేతర సంబంధాలు, 5శాతం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, 5శాతం ఇతర కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక కథనం..

- కలకలం రేపుతున్న వరుస బలవన్మరణాలు
- బతికి సాధించాలంటున్న మానసిక వైద్యనిపుణులు



రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య

మన దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతూనే ఉంది. మానసిక కుంగుబాటుతోనే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం మన దేశంలో 10లక్షల మంది అత్మహత్య చేసుకుంటున్నారు. రోజుకు ప్రపంచ వ్యాప్తంగా 3వేల మంది బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ప్రతీ 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. పంట దిగుబడి రాలేదని రైతు, పరీక్షల్లో ఫెయిలయ్యానని విద్యార్థి, ప్రేమలో ఓడిపోయానని మరొకరు, ఆరోగ్యం బాగా లేక ఇంకొకరు, ఉద్యోగం రాలేదని ఒకరు, భార్యాభర్తల మధ్య గొడవలు, వరకట్నం వేధింపులతో ఒకరు, అప్పుల బాధతో కొందరు, మద్యం మత్తులో గొడవలతో కొందరు, అలాగే ఒంటరిగా జీవించే వారు, జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు.. లేదా విడాకులు తీసుకున్నవారు, ఇతర శారీరక, మానసిక బాధలతో బాధపడుతున్న వారు.. దీర్ఘకాలిక వ్యాధులు కలిగినవారు.. బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వీరంతా ఆత్మహత్య చేసుకునేముందు ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితాంతం ఆనందంగా గడపవచ్చు.

ఎక్కువగా ఎవరంటే..

మగవాళ్ల కంటే ఎక్కువగా మహిళలే ఆత్మహత్య చేసుకుంటున్నారు. యవ్వనస్తులు, నడి వయస్సు దాటినవారు, ఈ మధ్య కాలంలో 15నుంచి40 ఏళ్లన్న వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒక్కసారి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన మెదడులో ఉత్పన్నమైందంటే ఏదో ఒకరోజు ఆచరిస్తారు. ఇలాంటివారిని కనిపెడుతూ ఉండాలి. ఒంటరిగా ఉండకుండా చూసుకోవాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులు వారిని కనిపెడుతూ ఉండాలి.

వీరిని ఆదర్శంగా తీసుకుందాం..

ఎందరో మహానుభావులు.. ఎన్నో ఓటములు చవిచూసి ఓటమి నేర్పిన పాఠాలు నేర్చుకుని ఎన్నో విజయాలు సాధించారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే విజయం మీ సొంతమవుతుంది.

- **అబ్రహం లింకన్:** ఇతను రెండుసార్లు వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయారు. శాసనసభ ఎన్నికల్లో ఐదుసార్లు ఓటమి పాలయ్యారు. 26 ఏళ్ల వయసులోనే భార్య మరణించింది. 27 ఏళ్ల వయసులో తీవ్రమైన నాడి రుగ్మతకు గురయ్యారు. అయినా ఎప్పుడూ కుంగిపోలేదు. 52 ఏళ్ల వయసులో అమెరికా అధ్యక్షుడయ్యారు.
- **థామస్ అల్వా ఎడిసన్:** కేవలం మూడు నెలల పాఠశాల అనుభవం ఉంది. ఇతడికి పాక్షిక చెవుడు. రూ.కోట్ల విలువైన ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతైంది. మొదటి బల్బు తయారీ ప్రక్రియలో 10వేల సార్లకు పైగా విఫలమయ్యారు. అయినా అధైర్యపడలేదు. చివరకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తగా ఎదిగారు.
- **అమితా బచ్చన్:** రేడియో వ్యాఖ్యాత ఇంటర్వ్యూలో విఫలమయ్యారు. అతడి గొంతు రేడియోకి పనికి రాదని అవమానించారు. ఆ తర్వాత నటనారంగంలో ఖ్యాతి గడించారు.
- **సచిన్ టెండూల్కర్:** పదో తరగతి ఫెయిలయ్యారు. ఆయనకు క్రికెట్‌లో ఉన్న ప్రతిభతో ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు.

ఇటీవలి ఘటనల్లో కొన్ని..

- హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన గోనె రమ్య (28) ఎనిమిదేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన శేఖర్‌ను ప్రేమ వివా హం చేసుకుంది. ఇద్దరు మంచిర్యాలలోని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నారు. శేఖర్ ఇటీవల మద్యానికి, పేకాటకు బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య కలహాలు ప్రారంభమయ్యా యి. ఈక్రమంలో తరచూ కట్నం తేవాలంటూ రమ్యను వేధించాడు. అక్రమ సంబంధం అంటగడుతూ మద్యం మత్తులో చేయిచేసుకునే వాడు. భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటికి వెళ్లి విషయం తెలిపింది. జరి గిన అవమానాన్ని భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన జంజిరాల స్నేహశీల (36) మందమర్రికి చెందిన మహేశ్‌ను ప్రేమవివాహం చేసుకుంది. వివాహమైన ఏడాది నుంచే భర్త నుంచి వేధింపులు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక, కన్న వాళ్లకు చెప్పుకోలేక 13 ఏళ్లు భరించింది. ఇద్దరు కుమార్తెలకు జన్మనిచ్చింది. స్నేహశీల లక్సెట్టిపేటలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తుండేది. మహేశ్ జులాయిగా తిరుగుతూ పేకాట, మద్యానికి బానిసయ్యాడు. అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తూ తరచూ కొడుతుండేవాడు. భర్త వేధింపులు భరించలేక ఈ నెల 16న స్నేహశీల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- ఈ నెల 20న నస్పూర్ మండలం సంఘమల్లయ్య పల్లెకు చెందిన రెడ్డి శ్రీనివాస్–అనూష దంపతుల కుమారుడు సాయిచరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. అతడిని పుస్తకాలు ఎక్కడ పడేసుకున్నావని తండ్రి మందలించగా క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆత్మస్థైర్యం నింపాలి



ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఒంటరిగా ఉండేందుకు ప్రయత్ని స్తారు. కొందరు మద్యానికి బానిసలవుతారు. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడారు. ప్రతీ చిన్న విషయానికి చిరాకు పడుతుంటారు. ఈ లక్షణాలు కలిగిన వారిలో చాలా మంది ఆత్మహత్యకు పాల్పడతారు. వీరిని మొదట గమనించాలి. జీవితంలో విజయాలు సాధించిన వారి కథలు చెబుతూ వీరిలో ఆత్మస్థైర్యం నింపాలి. అయినా మార్పు రాకుంటే మానసిక వైద్యనిపుణులకు చూపించాలి.

– విశ్వేశ్వర్‌రావ్, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాల

బతికి సాధించాలి



ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. చిన్న పాటి సమస్యలకు మానసికంగా కుంగి ఆత్మహత్యకు పాల్పడవద్దు. అండగా కట్టుకున్నవారు, కన్నవారు, స్నేహితులుంటారు. అన్నింటికీ మించి మనల్ని సృష్టించిన ఆ భగవంతుడున్నాడన్న నమ్మకంతో పట్టుదలతో పోరాడాలి. ధైర్యంగా నిలబడాలి. మనిషి నిత్య విద్యార్థి. ఓటమి వెనుక విజయం ఉందని గ్రహించాలి. అప్పుడే విజయం నీ సొంతమవుతుంది.

– బన్సిలాల్, సీఐ, మంచిర్యాల

లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: ఓ మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన ఓ మహిళ తన అన్నయ్యను చూసేందుకు 26 అక్టోబర్ 2020న భైంసా రూరల్ మండలం మహాలింగ గ్రామానికి వెళ్లింది. మరుసటిరోజు తిరిగి భైంసాకు రావడానికి బస్టాండ్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తోంది. కే బాలాజీ తన ఆటోలో సదరు మహిళను ఎక్కించుకున్నాడు. ఇతరులనెవరినీ ఎక్కించుకోకుండా ఆ మహిళను ఒంటరిగా తీసుకువెళ్లి లైంగికదాడికి యత్నించాడు. దీంతో ఆ మహిళ భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై పున్నం చందర్ కేసు నమోదు చేశారు. పరిశోధన అనంతరం బాలాజీని అరెస్ట్ చేశారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో నిర్మల్ సబ్ కోర్ట్ న్యాయమూర్తి రాధిక నిందితుడికి రెండేళ్ల సాధారణ కారాగార జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ.. శుక్రవారం తీర్పు వెల్లడించారు.

ఆర్జీయూకేటీలో యోగా దినోత్సవం

బాసర: స్పిక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో బాసర ఆర్జీయూకేటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకురాలు శ్రీలక్ష్మి విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మితోపాటు ప్రత్యేకాధికారి సృజనను సత్కరించారు. ఎస్ఎస్ఎస్ కోఆర్డి నేటర్ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత



మహిళకు సెల్‌ఫోన్ ఇస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్లను బాధితులకు అందించినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. మూడు నెలల్లో 10 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్పీ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వాటిని అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు, బేల స్టేషన్ పరిధిలో రెండు, బోథ్ స్టేషన్ పరిధిలో రెండు చొప్పున ఫోన్లను అప్పగించినట్లు తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సీఐలు ఫణీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

- రూ.2లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇల్లు

నేరడిగొండ: మండలంలోని లింగట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. లింగట్ల గ్రామానికి చెందిన మడావి నాగోరావు ఇంటికి ఆనుకుని ఉన్న పశువుల పాకలో పశుగ్రాసం ఉంది. శుక్రవారం ప్రమాదవశాత్తు పశుగ్రాసానికి మంటలు అంటుకున్నాయి. పశువుల పాకతో పాటు ఇల్లు కూడా దగ్ధమైంది. ఇంట్లోని నిత్యావసరాలు కాలిపోయాయి. ఘటనా స్థలానికి ఆర్ఐ నాగోరావు, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్ చేరుకుని పంచనామా నిర్వహించారు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. మాజీ సర్పంచ్ స్వర్ణాంజలి బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందించారు. నేరడిగొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్ బాధితుల వివరాలు తెలుసుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించినవారిపై కేసు

కడెం: మండలంలోని ఉప్పరిగూడేనికి చెందిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామపంచాయతీ పరిధి ఉప్పరిగూడేనికి చెందిన మహిళ ఈనెల 20న కాలినడకన ఉప్పరిగూడెం నుంచి బెల్లాల్ వెళ్తోంది. మార్గమధ్యలో బెల్లాల్ చెరువు కట్టపై మద్యం సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులు మహిళతో అసభ్యంగా మాట్లాడారు. అంతటితో ఆగకుండా వెంబడించగా ఆమె తప్పించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి వచ్చిన కుటుంబ సభ్యులను ఆ యవకులు కొట్టినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మండలంలోని హరిజనవాడకు చెందిన ముగ్గురు, ఇతర గ్రామాలకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దేవు తెలిపారు.

బావిలో పడి తాపీమేస్త్రీ మృతి



మిలింద్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్‌కు చెందిన తాపీ మేస్త్రీ బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై సునీల్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంనగర్‌కు చెందిన హన్వతే మిలింద్ (35) తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా నయంకాలేదు. ఈ నెల 16న ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా.. ఎవరికీ తెలియకుండా ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మిలింద్ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని వ్యవసాయ బావిలో అతడి మృతదేహాన్ని వ్యవసాయ కూలీలు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఫిట్స్ రావడంతోనే బావిలో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి హన్వతే దొండిబా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య సుజాత ఉంది.

యోగాతో ఒత్తిడి దూరం



యోగాసనాలు వేస్తున్న డీడీ, అధికారులు

ఉట్నూర్‌రూరల్: యోగాతో ఉద్యోగులు ఒత్తిడికి దూరమవుతారని గిరిజన సంక్షేమశాఖ డీడీ దిలీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రతి రోజూ కనీసం అరగంట యోగా కోసం కేటాయిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లోనూ విద్యార్థులకు యోగాను అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం యోగాచార్యుడు సంతోష్ యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ ఆసనాలు వేయించారు. అనంతరం సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం రామానందం, ఆర్సీవో గంగాధర్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతి, ఏఎస్వోలు హేమంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, రవీందర్, కోచ్‌లు సునంద్, శివకుమార్, శేఖర్ తదితరులున్నారు.

అధికారిక సమావేశంలో అనధికార దర్పం

అధికారులు, సభ్యులు మాత్రమే హాజరుకావాల్సిన శుక్రవారం నాటి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కొంతమంది అనధికార వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా హాజరయ్యారు. బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు సమావేశ మందిరంలో సమావేశం ముగిసేవరకు కూర్చున్నారు. ఎమ్మెల్యేల వెంట వచ్చిన మరికొంత మంది వారు మాట్లాడినంతా సేపు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్




సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్న ఎమ్మెల్యేల అనుచరులు




సభ్యుల మాదిరిగా కూర్చున్న నాయకులు

రిమ్స్‌లో జూడాల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: డిమాండ్లు నెరవేర్చాలని రిమ్స్ జూనియర్ వైద్యులు శుక్రవారం ఓపీ ఎదుట నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి మూడురోజులు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేలా విధులు నిర్వహిస్తూ నే నిరసన కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.

జ్యుయలరీ షాపులో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అశోక్‌రోడ్‌గల శ్రీగణేశ్ జ్యుయలరీలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11గంటలకు ముగ్గురు గుర్తు తెలియని మహిళలు జ్యుయలరీ షాపునకు వచ్చి కాళ్ల పట్టీలు చూపించాలని కోరారు. దీంతో యజమాని షాపులోని అన్ని పట్టీలు చూపించాడు. ఈ క్రమంలో సదరు మహిళలు సుమారు కిలో వెండి పట్టగొలుసులు అపహరించారు. షాపుయజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువుకున్న బడికి టీచర్లుగా..

బోథ్: సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన గ్రామానికి చెందిన రడాపు మధుసూదన్, ఓస శ్రీనివాస్, గొల్లపెల్లి రమేశ్ చందర్ ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల్లో ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకే ఉపాధ్యాయులుగా రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

కొడుకు హత్యకు కారకులైనవారిని శిక్షించాలని టవర్ ఎక్కిన తండ్రి



టవర్ ఎక్కిన గోపాల్‌ను సముదాయిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: తన కొడుకు రాథోడ్ సాయికుమార్ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ తండ్రి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది.. మండల కేంద్రంలోని గోపాయిచెరువులో గురువారం అనుమానాస్పదంగా శవమై తేలిన సాయికుమార్ తండ్రి రాథోడ్ గోపాల్ కొడుకు హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక అంగడిబజార్‌లోని సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై మనోహర్ అక్కడకు చేరుకుని టవర్ దిగాలని కోరారు. వర్షం కురుస్తున్నా గోపాల్ సెల్ టవర్ దిగలేదు. విషయాన్ని డీఎస్పీ నాగేందర్ దృష్టికి తీసుకువెళ్లగా టవర్ వద్దకు చేరుకున్న అతడు ఫోన్ ద్వారా గోపాల్‌తో మాట్లాడి సముదాయించే ప్రయత్నం చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. డీఎస్పీ హామీతో గోపాల్ టవర్ దిగాడు. అనంతరం గోపాల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వీఆర్ఏ కూతురుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుధారాణి

దస్తురాబాద్: మండంలోని గోడిసీర్యాల గ్రామానికి చెందిన వీఆర్ఏ పోషం కుమార్తె సుధారాణి డాక్టరేట్ పట్టా అందుకుంది. సుధారాణి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించింది. పేద కుటుంబానికి చెందిన సుధారాణి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బీటెక్, ఎంటెక్, ప్రొఫెసర్ జయశంకర్ కాలేజీలో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఎన్టీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయంలో మట్టి లేకుండా నీళ్లలో మొక్కలు పెంచే విధానంపై పరిశోధనలు చేసి ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ సెక్రటరీ డాక్టర్ మీమాన్స్‌పాటక్, వీసీ డాక్టర్ శారద విజయలక్ష్మి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకున్నది. సుధారాణి డాక్టరేట్ పొందడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.